మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శనివారం 15 ఆగస్టు 2026 పేజీలు : 4

## వికసిత్ భారత్‌కు మొక్కలతో శ్రీకారం

- ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి
- విద్యార్థినులకు కలెక్టర్ సూచనలు
- పర్యావరణ పరిరక్షణకు పిలుపు



2లో.

చీరాల రక్షణ న్యూస్

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా విజన్ 2047 అభివృద్ధికి ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా చీరాలలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యతో కలిసి మొక్కలు నాటారు.

# అగ్నిమాపక దళానికి ఆధునిక ‘బలం’



వివరాలు 2లో..

- రూ.40 కోట్లతో 58 కొత్త వాహనాలు
- జెండా ఊపి ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- త్వరలో మూడో దశలో మరిన్ని వాహనాలు

అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా రాష్ట్ర అగ్నిమాపక శాఖను ఆధునికీకరిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు రూ.40 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 58 అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలను శుక్రవారం అమరావతిలో ఆయన ప్రారంభించారు. గ్రామీణ, అటవీ, పట్టణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను వేగంగా ఎదుర్కొనేందుకు ఈ వాహనాలు ఉపయోగపడనున్నాయి.

## పల్నాడులో అభివృద్ధి.. స్వాతంత్ర్య స్ఫూర్తి

- 480 మొక్కలతో పచ్చదనానికి శ్రీకారం
- ఎన్‌హెచ్-167ఏ భూసేకరణ కేసులపై విచారణ
- రీ సర్వే పనులకు వేగం
- ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ మార్కెట్ల అవకాశం



2లో.

పల్నాడు జిల్లాలో స్వాతంత్ర్య వేడుకల సన్నాహాలు, మొక్కల పెంపకం, రీ సర్వే, జాతీయ రహదారి భూసేకరణ, ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ అవకాశాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు శుక్రవారం పలు కీలక కార్యక్రమాలు చేపట్టారు. నరసరావుపేట రక్షణ న్యూస్:

## బాపట్లలో ‘హర్ ఘర్ తిరంగా’ బైక్ ర్యాలీ



- భారీగా తరలివచ్చిన యువత
- ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి: ఎమ్మెల్యే వేగేశన
- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

2లో.

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బాపట్లలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో ‘హర్ ఘర్ తిరంగా’ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. యువత, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జాతీయ జెండాలతో పాల్గొని దేశభక్తిని చాటారు. బాపట్ల రక్షణ న్యూస్:



10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/15/2026 3:27 AM Page 2



# వికసిత్ భారత్‌కు మొక్కలతో శ్రీకారం

మొదటి పేజీ తరువాయి

చీరాల రక్షణ న్యూస్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వికసిత్ భారత్ జి రామ్ జి పథకం కింద చీరాల ఏపీ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, ఆప్కో చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. విజన్ 2047 లక్ష్యంతో నేడు నాటిన మొక్కలు భవిష్యత్తులో మహావృక్షాలుగా ఎదిగి దేశ అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఉన్నత లక్ష్యంతో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలెక్టర్ ముచ్చటించారు. విద్యాబోధన, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు బాగా చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించిన అనంతరం వివాహం చేసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలకు ఒత్తిడి ఎదురైతే పోలీసులకు, అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఈవో శ్రీనివాస్ సింగ్, చీరాల ఆర్డీవో నరసింహారావు, పాఠశాల ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యకు చెక్



చెరుకూరు రక్షణ న్యూస్

గ్రామంలో కొంతకాలంగా విద్యుత్ స్తంభాల నుంచి కిందకు వేలాడుతున్న వైర్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోకి వచ్చిపోయే లారీలు, గడ్డిబళ్లకు వైర్లు అడ్డుగా ఉండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడేది. ఈ సమస్యను గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు తాజాగా గ్రామంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో కిందకు జారిన వైర్ల సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు లారీలు, గడ్డిబళ్ల రాకపోకలకు ఏర్పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్న ఏఈ రాంబాబు, ఎల్ఐ కళ్యాణరావు, జేఎల్ఎం సుమంత్‌లకు గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# బాపట్లలో 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీ

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్:

దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో పట్టణంలో 'హర్ ఘర్ తిరంగా' భారీ బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. యువత, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో దేశభక్తిని చాటారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ (బీఈసీ) వరకు సాగింది. అక్కడి నుంచి తిరిగి పట్టణంలోని చారిత్రాత్మక శ్రీ క్షీర భావనారాయణ స్వామి దేవాలయం వద్దకు చేరుకోవడంతో ర్యాలీ ముగిసింది. ర్యాలీలో పాల్గొన్న యువత, నాయకులు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. దీంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

**ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి...** ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.. ఆగస్టు 15న జరగనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వాతంత్ర్య ఫలాలను భావితరాలకు అందించడంతో పాటు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం ద్వారా దేశ భవిష్యత్తును మరింత బలోపేతం చేయవచ్చన్నారు.

**అభివృద్ధి పథంలో భారత్..** ప్రపంచంలోనే భారతదేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా ఎదుగుతూ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశ ప్రగతిలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం ఒక పండుగగా కాకుండా దేశభక్తిని, జాతీయ ఐక్యతను చాటిచెప్పే రోజుగా జరుపుకోవాలని కోరారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో బావుడా చైర్మన్, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్నిమాపక దళానికి ఆధునిక 'బలం'

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ న్యూస్...

అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి కొత్త అగ్నిమాపక వాహనాలను ప్రారంభించారు. వాహనాల్లో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరికరాలు, వాటి పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే విధానాన్ని అగ్నిమాపక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన 58 వాహనాల్లో రూ.18.68 కోట్ల విలువైన 25 అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలు ఉన్నాయి. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రమాద ప్రాంతాలకు వేగంగా చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టేలా వీటిని సమకూర్చారు.

**14 వేల లీటర్ల సామర్థ్యంతో..** భారీ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను అదుపు చేసేందుకు నిరంతరాయంగా నీటిని సరఫరా చేయడం కీలకం. ఇందుకోసం రూ.14.79 కోట్ల విలువైన 20 వాటర్ బౌజర్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఒక్కో వాటర్ బౌజర్ 14 వేల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటుందని అధికారులు సీఎంకు వివరించారు. పట్టణాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో భారీ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఇవి కీలకంగా ఉపయోగపడనున్నాయి.

**ఇరుకు ప్రాంతాలకు 'క్విక్ రెస్పాన్స్'...** రద్దీగా ఉండే పట్టణ ప్రాంతాలు, ఇరుకైన వీధుల్లో పెద్ద అగ్నిమాపక వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా క్విక్ రెస్పాన్స్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.6.37 కోట్లతో 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే వేగంగా ఘటనాస్థలికి చేరుకుని ప్రాథమికంగా మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**రూ.252.86 కోట్లతో ఆధునీకీకరణ...** సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ.252.86 కోట్ల వ్యయంతో అగ్నిమాపక శాఖకు దశలవారీగా ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. తొలి దశలో రూ.33 కోట్ల వ్యయంతో 65 అగ్నిమాపక వాహనాలను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రెండో దశలో ప్రస్తుతం రూ.40 కోట్లతో 58 వాహనాలను ప్రారంభించామని, త్వరలో మూడో దశలో మరిన్ని అగ్నిమాపక వాహనాలు, ఆధునిక ఫైర్‌ఫైటింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. అగ్నిమాపక శాఖను కేవలం వాహనాల పరంగానే కాకుండా మౌలిక సదుపాయాల పరంగానూ బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

**17 కొత్త ఫైర్ స్టేషన్లు...** రాష్ట్రంలో 17 కొత్త ఫైర్ స్టేషన్ భవనాల నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల చొప్పున వ్యయం చేస్తున్నామని పేర్కొన్నారు. వీటిలో ఇప్పటికే ఆరు భవనాల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. మరో 36 ఫైర్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే వ్యవస్థను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆధునిక వాహనాలు, సాంకేతిక పరికరాలు, మెరుగైన మౌలిక వసతులతో అగ్నిమాపక సేవల సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణతో పాటు అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/15/2026 3:27 AM Page 3



# వైసీపీకి రాజకీయ భవిష్యత్తు లేదు... యరపతినేని

**గుంటూరు రక్షణ న్యూస్**

వైసీపీ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఆ పార్టీ రానున్న రోజుల్లో మరో రాజకీయ పార్టీలో విలీనం కావాల్సిన పరిస్థితి రావచ్చని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు వైసీపీని ఇప్పటికే తిరస్కరించారని, ఇకపై రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమని వ్యాఖ్యానించారు.వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు రాజకీయ విలువలను దిగజార్చేలా ఉన్నాయని యరపతినేని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలను అణచివేసే ధోరణితో వ్యవహరించడం, రాజకీయ ప్రత్యర్థులను బెదిరించడం వంటి విధానాల ఫలితమే 151 సీట్ల నుంచి 11 సీట్లకు వైసీపీ పరిమితం కావడమని అన్నారు.ప్యాక్షన్ రాజకీయాలు, కక్ష సాధింపు వ్యవహారాలకు తాము దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నామని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంపైనే దృష్టి కేంద్రీకరించామని తెలిపారు. తమపై బెదిరింపులకు దిగే ప్రయత్నాలు చేస్తే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, వారి కుటుంబాలపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని యరపతినేని హెచ్చరించారు. రాజకీయాల్లో ఒక హద్దు, ఒక పద్ధతి ఉంటుందని.. దాన్ని దాటితే తగిన విధంగా



స్పందించాల్సి వస్తుందని అన్నారు. వైసీపీలో అంతర్గతంగా చోటుచేసుకునే వివాదాలు, హింసాత్మక ఘటనలను సైతం టీడీపీపై నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. వైసీపీకి ఒక న్యాయం, తమకు మరో న్యాయం అన్నట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కార్యక్రమాలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు.శాసనమండలిలోనూ వైసీపీ బలం క్రమంగా తగ్గిపోతోందని యరపతినేని అన్నారు. వైసీపీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలు, ప్రజా వ్యతిరేక ధోరణులే ఆ పార్టీ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని, కక్షలు, వివాదాలు, వ్యక్తిగత దూషణల రాజకీయాలకు కాలం చెల్లిందని యరపతినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.'

# చిన్నారి వైద్యానికి ఏలూరి సాయం

**మార్టూరు రక్షణ న్యూస్**

వైద్య ఖర్చులు భరించలేక దిక్కుతోచని స్థితిలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అండగా నిలిచారు. నెలలు నిండకుండానే జన్మించిన పసికందుకు అత్యవసర చికిత్స అవసరమై, ఇంక్యుబేటర్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1,50,144 ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి భరోసా కల్పించారు.బాపట్ల జిల్లా మార్టూరు మండలం మార్టూరు గ్రామానికి చెందిన చుండి జయప్రకాష్, చాందిని దంపతులకు ఐదు రోజుల క్రితం మగశిశువు జన్మించాడు. నెలలు నిండకపోవడంతో వైద్యుల సూచన మేరకు శిశువును చిలకలూరిపేటలోని వరలక్ష్మి ఆసుపత్రిలో ఇంక్యుబేటర్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. బిడ్డ ఆరోగ్యం కోసం ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులకు పెరుగుతున్న వైద్య ఖర్చులు మరింత భారంగా మారాయి.ఆర్థిక ఇబ్బందులతో చికిత్స కొనసాగించడం కష్టంగా మారడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆశ్రయించారు.



వారి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌వోసీ ద్వారా రూ.1,50,144 మంజూరు చేయించారు. అనంతరం ఆర్థిక సాయం చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.బిడ్డ ప్రాణాలను కాపాడుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందించిన సాయం తమకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. తమ బిడ్డకు మెరుగైన వైద్యం అందించేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

# పేద కుటుంబానికి ఆర్థిక సాయం



**బాపట్ల రక్షణ న్యూస్**

కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబానికి ఫ్రెం డ్స్ ఆదర్శ్ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు అండగా నిలిచారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న వెంకటేశ్వర్లు గురువారం పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ఆకస్మిక ంగా గుండెపోటుకు గురై రోడ్డుపై కుప్పకూలారు. కుటుంబ సభ్యు లు, స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆయన మృతి చెందారు.వెంకటేశ్వర్లుకు భార్యతో పాటు నాలుగో తరగతి చదువుతు న్న కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఆయన ఆకస్మిక మృతితో భార్య, కుమార్తె దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఫ్రెండ్స్ ఆదర్శ్ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు స్పందించి ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడమే తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఆర్గనైజేషన్ సభ్యులు బలరాం, కన్నబాబు, అజయ్ పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తితో పచ్చని భవిష్యత్తు



**బాపట్ల రక్షణ న్యూస్**

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, భావితరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు మొక్కలు నాటారు. బాపట్ల పట్టణంలోని వివేకానంద కాలనీ సచివాలయం సమీపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, దేశ నిర్మాణంతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని బాధ్యతగా సంరక్షించినప్పుడే పచ్చని భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డీఓ హరి కుమార్, మున్సిపల్ కమిషనర్ హాసిని, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ



**కొల్లూరు రక్షణ న్యూస్**

కొల్లూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొల్లూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలు, వినతులను స్వీకరించారు.ప్రజలు ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్యం, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని పరిశీలించిన ఎమ్మెల్యే.. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారం చూపించడమే 'మీకోసం' కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/15/2026 3:27 AM Page 4



# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

## 17 నుంచి పూర్తి స్థాయి నిషేధం.. ఉల్లంఘిస్తే జరిమానా



**గుంటూరు రక్షణ న్యూస్:**

నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని ఈ నెల 17 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేయాలని నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం స్పష్టం చేసింది. నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు శుక్రవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రజారోగ్య విభాగ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. 17వ తేదీ నుంచి నిబంధనలు ఉల్లంఘించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించే వారిపై అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ఖాళీ స్థలాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ఎంఎల్‌ఓ ఆయిల్, ఎబైట్ స్ప్రే చేయించాలని బయాలజిస్ట్‌కు సూచించారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి స్థలాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. నగరంలో డోర్‌టు డోర్ చెత్త సేకరణ వందశాతం జరగాలని, సైడ్ డ్రెయిన్లను ప్రతిరోజూ శుభ్రం చేసి వ్యర్థాలను వెంటనే తరలించాలని ఆదేశించారు. రోడ్లపై గార్బేజ్ పాయింట్లు లేకుండా చూడాలని, ఉన్న వాటిని తక్షణమే తొలగించాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్మికుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారానే నమోదు చేయాలని, బల్క్ వేస్ట్ జనరేటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. డాగ్ ఫీడింగ్ జోన్లపై ప్రజలకు అవగాహన కల్పించి, కుక్కలకు నిర్ణీత ప్రాంతాల్లోనే ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారులపై యథేచ్ఛగా వదిలే పశువుల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అటువంటి పశువులను పట్టుకుని నగరపాలక సంస్థ బందెలదొడ్డికి తరలించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, బయాలజిస్ట్ శేషయ్య, వెటర్నరీ వైద్యులు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణకు వేగం

## 86 నిర్మాణాల్లో 81 తొలగింపు.. 1,482 మీటర్ల డ్రైన్ పనులు పూర్తి




**గుంటూరు రక్షణ న్యూస్:**

నగరంలోని బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన రోడ్డు విస్తరణ పనుల పురోగతిపై వివరాలను వెల్లడించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచే స్తుండటంతో పనులు నిర్దేశిత వేగంతో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రభావితమవుతున్న మొత్తం 86 నిర్మాణాల్లో 81 నిర్మాణాలను ఇప్పటికే తొలగించినట్లు కమిషనర్ తెలిపారు. మిగిలిన ఐదు భవనాలు కోర్టు కేసుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. రహదారికి ఇరువైపులా మొత్తం 2,315 మీటర్ల మేర డ్రైన్ నిర్మించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1,482 మీటర్ల పనులు పూర్తయ్యాయని వివరించారు. రోడ్డు విస్తరణలో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విస్తరణలో ప్రభావితమవుతున్న 73 చెట్లపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర, అటవీశాఖ అధికారుల బృందం పరిశీలన జరిపిందన్నారు. వాటిలో 29 చెట్లను ట్రాన్స్‌లొకేషన్ చేయవచ్చని, 44 చెట్లను తరలించడం సాధ్యం కాదని నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే హెడ్‌వాటర్ వర్క్స్‌లోని ఖాళీ స్థలంలో 18 చెట్లను విజయవంతంగా రీ-లొకేట్ చేసినట్లు వెల్లడించారు. తరలించేందుకు వీలుకాని చెట్లలో 35ను తొలగించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా 25 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా 17 కల్వర్టుల పనులు పూర్తయ్యాయని కమిషనర్ చెప్పారు. రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న 73 విద్యుత్ స్తంభాల్లో 25 స్తంభాలను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు మార్చినట్లు తెలిపారు. అలాగే మార్చాల్సిన 11 ట్రాన్స్‌ఫార్మర్లలో మూడింటిని షిఫ్ట్ చేసినట్లు వివరించారు. ప్రతి సోమవారం విస్తరణ పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నామని, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి రహదారిని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు.

## చెన్నారెడ్డి హత్య కేసులో ఐదుగురు అరెస్టు

**గురజాల రక్షణ న్యూస్**



పల్నాడు జిల్లా రెంటాలలో సంచలనం రేపిన నవులూరి చెన్నారెడ్డి హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. కేసుతో సంబంధం ఉన్న ఐదుగురు నిందితులను దాచేపల్లి--మాచర్ల క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. రాజకీయ ఆధిపత్య విభేదాలే హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం.. చెన్నారెడ్డిని లక్ష్యంగా చేసుకున్న నిందితులు ముందుగా స్కార్పియో వాహనంతో ఢీకొట్టారు. అనంతరం అతడి కళ్లలో కారం చల్లి, గొడ్డళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు వెల్లడించారు. హత్యకు ఉపయోగించిన స్కార్పియో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే హత్య అనంతరం గోలివాగులో పడవేసిన మూడు గొడ్డళ్లను కూడా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు, హత్యకు దారితీసిన పూర్తి కారణాలు, ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి నిందితులను అరెస్టు చేయడంతో దర్యాప్తులో కీలక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

# స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### కలెక్టర్ వినోద్ కుమార్



**బాపట్ల రక్షణ న్యూస్**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో వేడుకల ఏర్పాట్లపై తుది దశ సమీక్ష నిర్వహించారు. జిల్లాస్థాయి వేడుకలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారని కలెక్టర్ తెలిపారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లాస్థాయి వేడుకల్లో శకటాలు, స్టాళ్ల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. వేదికపై కుర్చీల అమరిక, ఆహ్వాన పత్రాల పంపిణీ, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విశిష్ట సేవలందించిన ప్రతి శాఖ, విభాగంలోని ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకల్లో నిర్లక్ష్యం వల్ల పొరపాట్లు జరిగితే సంబంధితులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతకు విద్యార్థుల ప్రతిజ్ఞ

## హర్గర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు

**కర్లపాలెం రక్షణ న్యూస్**

శ్రీ భార్గవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత పేరాల వెంకట సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సుమారు 200 మీటర్ల జాతీయ జెండాను చేతబూని ప్రధాన రహదారులపై ఉత్సాహంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పాల్గొని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకున్నారు. జాతీయ జెండాలతో పాటు విద్యార్థులు చేసిన దేశభక్తి నినాదాలతో కర్లపాలెం జాతీయ రహదారి మార్మోగింది. విద్యార్థుల ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను, దేశ స్వాతంత్ర్యం కోసం సమరయోధులు చేసిన పోరాటాలు, త్యాగాలను విద్యార్థులకు వివరించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశం పట్ల బాధ్యత వంటి విలువలను యువత అలవర్చుకోవాలని సూచించారు. భారీ స్థాయిలో తిరంగా ర్యాలీ నిర్వహించిన విద్యాసంస్థల అధినేత పేరాల వెంకట సురేష్‌తో పాటు సిబ్బందిని ఆయన అభినందించారు.అనంతరం శ్రీ భార్గవి విద్యాసంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కలను తాంద్ర సాంబశివరావు నాటారు. తిరంగా ర్యాలీలో భాగంగా కర్లపాలెం సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి తాంద్ర సాంబశివరావు, పేరాల వెంకట సురేష్, నాయకులు మందపాటి పరమానంద కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాలను మరింత పెంపొందించేలా సాగింది. విద్యార్థుల స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు, జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరాల లక్ష్మి, బాపట్ల మాజీ సైనిక సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చలికొండ వెంకట కృష్ణారావు, హవల్దార్ బోలగాని గోపి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# దేశభక్తితో విద్యార్థుల విన్యాసాలు

**రెంటచింతల రక్షణ న్యూస్**



రెంటచింతల మండల కేంద్రంలోని బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు వినూత్న రీతిలో దేశభక్తిని చాటు కున్నారు. బాలవికాస్ విద్యా సంస్థల చైర్మన్ అల్లం ఇన్నారెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు భారతదేశ చిత్రపట ఆకృతిలో నిలబడి ఆకట్టుకునే విన్యాసాలు ప్రదర్శించారు.విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని భారతమాతకు జై అంటూ నినాదాలు చేయడంతో పాఠశాల ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. భారత చిత్రపట ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను మరింతగా పెంపొందించేందుకు దోహదపడింది.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,ఉపాధ్యాయినులు,విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# పేదలకు ఫౌండేషన్ చేయూత

**కర్లపాలెం రక్షణ న్యూస్**



అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పాతూరుకు చెందిన ఓ నిరుపేద మహిళకు బియ్యం సాయం అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ బాషా 10 కిలోల బియ్యాన్ని మహిళకు అందజేశారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాషా మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలిచే ఉద్దేశంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందించడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దాతలు, ఫౌండేషన్ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నా మని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి షేక్ మస్తాన్ వలి, మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ బాషా, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# మువ్వన్నెల జెండాలతో దద్దరిల్లిన చీరాల



**చీరాల రక్షణ న్యూస్**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చీరాలలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆధ్వర్యంలో శుక్రవారం భారీ తిరంగా బైక్ ర్యాలీ ఉత్సాహంగా నిర్వహించారు. నల్లగాంధీ బొమ్మ వద్ద ప్రారంభమైన ర్యాలీ ముంతవారి సెంటర్, గర్ల్స్ హైస్కూల్, ఎంజీసీ మార్కెట్, బస్టాండ్ మీదుగా గడియార స్తంభం వరకు సాగింది.ఎమ్మెల్యే మాలకొండయ్య ర్యాలీలో పాల్గొని జాతీయ జెండాను ప్రదర్శించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో ర్యాలీని ఉత్సాహభరితంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరిలో జాతీయ భావం, దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు ముప్పవల వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# గ్యాస్ కనెక్షన్లకు ఈ-కేవైసీ తప్పనిసరి



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలోని ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులంతా ఆగస్టు 15లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ. జగన్‌మోహన్‌రావు సూచించారు. గ్యాస్ కనెక్షన్ల వివరాల ధ్రువీకరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 3,53,331 గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇప్పటివరకు 3,27,640 మంది ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారని, ఇంకా 25,691 మంది పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా సంబంధిత గ్యాస్ సంస్థల మొబైల్ యాప్‌లలో ఈ-కేవైసీ చేసుకోవచ్చని తెలిపారు. సమీపంలోని గ్యాస్ పంపిణీదారు కార్యాలయంలోనూ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చన్నారు. వినియోగదారులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. గడువులోగా ప్రక్రియ పూర్తి చేయని కనెక్షన్లపై నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. గ్రామ, వార్డు స్థాయిలో అవగాహన కల్పించి అర్హులైన ప్రతి వినియోగదారుడితో ఈ-కేవైసీ పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.

# స్వాతంత్ర్య వేడుకల మైదానంను పరిశీలిస్తున్న కలెక్టర్



**బాపట్ల రక్షణ న్యూస్**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న పోలీస్ కవాతు మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.వేడుకల ప్రాంగణాన్ని త్రివర్ణ పతాకాలతో అలంకరించాలని, బాపట్ల జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వేదిక, కవాతు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంతాలతో పాటు అతిథులు, ప్రజలు కూర్చునేందుకు తగిన సీటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమాలను సమయపాలనతో నిర్వహించాలని, స్టాళ్ల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, బాపట్ల ఆర్డీవో హరికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/15/2026 3:27 AM Page 6



# పల్నాడులో అభివృద్ధి.. స్వాతంత్ర్య స్ఫూర్తి

మొదటి పేజీ తరువాయి

**నరసరావుపేట రక్షణ న్యూస్:**

పల్నాడు జిల్లాలో పరిపాలన, అభివృద్ధి, భూసేకరణ, రీ సర్వే, పారిశ్రామిక రంగం, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన కార్యక్రమాలు శుక్రవారం విస్తృతంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, జాయింట్ కలెక్టర్ సంజన సింహ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పలు కార్యక్రమాలను నిర్వహించారు.

**480 మొక్కలతో పచ్చదనానికి శ్రీకారం...**80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన తిరంగా ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ కృతిక శుక్ల పాల్గొన్నారు. ముందుగా గణేష్ విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి వెలిగించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో 480 మొక్కలు నాటుతున్నామని, ప్రతి తరగతి విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకుని వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య దినోత్సవం ఒక్కరోజుకే పరిమితం కాకుండా నిరంతరం మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. జాతీయ పతాక రూపకర్త ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పింగళి వెంకయ్య అని విద్యార్థులకు వివరించారు. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, పల్నాడు ప్రాంతానికి చెందిన అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం చేసిన త్యాగాలను గుర్తు చేశారు.విద్యార్థులు బాగా చదువుకోవడం, తల్లిదండ్రులకు సహాయపడటం, ఇతరులకు అండగా నిలవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న బాధ్యతలను స్వీకరించడం ద్వారా సమాజంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు.

**అడవుల పెంపకంపై దృష్టి...**కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో అడవుల విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు నరికివేయడం, చెట్లకు నిప్పు పెట్టడం, మొక్కలు నాటకపోవడం వంటి కారణాలతో జిల్లాలో అడవుల శాతం తగ్గిందని తెలిపారు. విద్యార్థులు మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల భూమి కలుషితమవుతుందని వివరించారు. దేశభక్తి, బాధ్యత కలిగిన పౌరులుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు.

**కేంద్రీయ విద్యాలయాలకు స్థలాలు...**నరసరావుపేటలోని కేంద్రీయ విద్యాలయానికి ఈ నెలలోనే స్థలం కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సత్తెనపల్లి, ఎడ్లపాడు ప్రాంతాల్లోని కేంద్రీయ విద్యాలయాలకు తాను జాయింట్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో స్థలం కేటాయించినట్లు చెప్పారు. మాచర్ల కేంద్రీయ విద్యాలయాన్ని తన హయాంలో తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు, నియమ నిబంధనలు, సిలబస్ బాగుంటాయని పేర్కొంటూ విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఎన్‌హెచ్-167ఏ భూసేకరణ కేసులపై విచారణ...**చిలకలూరిపేట--నెకరికల్లు జాతీయ రహదారి ఎన్‌హెచ్-167ఏ ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తయ్యేలా భూసేకరణకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రాజెక్టుకు సంబంధించిన 34 మధ్యవర్తిత్వ కేసులపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల విచారణ చేపట్టారు. భూసేకరణ సమస్యలు పరిష్కారమైతే రహదారి నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి.

**రీ సర్వే పనులు వేగవంతం...**జిల్లాలో కొనసాగుతున్న రీ సర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంజన సింహ సంబంధిత అధికారులను ఆదేశించారు. చిలకలూరిపేట మండలంలోని స్వర్ణ, ఎడవల్లి గ్రామాల్లో రీ సర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకుని అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏడీ, చిలకలూరిపేట తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

**అర్జీల పరిష్కారంలో నాణ్యత...**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని జాయింట్ కలెక్టర్ సంజన సింహ సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో రీ-ఓపెన్ అయిన అర్జీలను ఆమె పరిశీలించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. సమస్యను పరిష్కరించినట్లు చూపించడం కాకుండా వాస్తవంగా ప్రజలకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**బొప్పుడి ఆలయంలో ఏర్పాట్ల పరిశీలన...**ఈ నెల 27న గవర్నర్ పర్యటన నేపథ్యంలో బొప్పుడి ఆలయంలో ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ సంజన సింహ పరిశీలించారు. ఎస్ఈ (పీఆర్), ఈఈ (ఆర్అండ్‌బీ), ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఏడీ గనులు, ఆర్డీవో నరసరావుపేట, ఈఓ బొప్పుడి, తహసీల్దార్ చిలకలూరిపేటలతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ మార్కెట్ల అవకాశం...**పల్నాడు జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలను కల్పించేందుకు రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్స్ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రపంచ బ్యాంకు సహకారంతో అమలు చేస్తున్న ర్యాంప్ కార్యక్రమంలో భాగంగా ఈ బీ2బీ సమావేశాలను నిర్వహించనున్నారు.విశాఖపట్నంలో ఆగస్టు 19 నుంచి 21 వరకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు ఇండియన్ ఎస్ఎంఈ ఫోరం ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్, మసాలాలు, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, హ్యాండీక్రాఫ్ట్స్, ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్, కాస్మెటిక్స్, హెర్బల్, వెల్‌నెస్, ఆక్వా, యానిమల్ ఫీడ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్, ఆటోమొబైల్, ఆటో కాంపోనెంట్స్ తయారు చేసే ఎంఎస్ఎంఈలకు ఈ కార్యక్రమం ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులతో నేరుగా వ్యాపార అవకాశాలు లభించనున్నాయి.ఎగుమతులకు సిద్ధంగా ఉన్న సంస్థలకు మార్కెట్ యాక్సెస్, ఉత్పత్తుల ప్రమోషన్, ఎగుమతి అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార విస్తరణకు అవకాశాలు కల్పించనున్నారు. ఆసక్తి ఉన్న ఎంఎస్ఎంఈలు స్వామీవీజువీజు పోర్టల్‌లో నమోదు చేసుకోవడంతో పాటు తమ ఎగుమతి సన్నద్ధతను అంచనా వేసుకునేందుకు స్వావీశక్ష్మా ప్లాట్‌ఫారాన్ని వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు కోరారు.

**స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు...**80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పల్నాడు జిల్లా సిద్ధమైంది. నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం, క్యాంపు కార్యాలయం, రెవెన్యూ డివిజినల్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ భవనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక విద్యుత్ దీపాలతో భవనాలను తీర్చిదిద్దారు.

**నేడు నాదెండ్ల మనోహర్ జెండా ఆవిష్కరణ...**80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఉదయం 9 గంటలకు నరసరావుపేట కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకావిష్కరణ జరగనుంది. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. వేడుకలకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# దేశభక్తి చాటిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



**విద్యార్థులతో మూడు బొమ్మల సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన**

**గుంటూరు రక్షణ న్యూస్:**

భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని, త్రివర్ణ పతాక గౌరవాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలనే సంకల్పంతో గుంటూరు నగరంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సూచనలతో శుక్రవారం నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు జాతీయ ఐక్యతను చాటిచెప్పడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడుతూ, నిబంధనలకు అనుగుణంగా జెండాను ఎగురవేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువతలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు దేశాభివృద్ధి, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే స్ఫూర్తిని కల్పించవచ్చని తెలిపారు. విద్యార్థులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏఓ తిరుపతినాయుడు, యూపీపీ సెల్ పీఓ సింహాచలం, మేనేజర్ బాలాజీబాషా, ఎస్.ఎన్.ప్రసాద్, సీఓలు, విద్యార్థులు, జీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.